తీరు మారదు.. చెత్త తొలగదు

- అల్లీపురం డంపింగ్ యార్డులో పేరుకుపోతున్న చెత్త
- యార్డు లోపలికి ఆటోలు వెళ్లేందుకు మార్గం లేక నిత్యం ట్రాఫిక్ జామ్
- స్థానికుల ఆందోళన



యార్డు బయటకు వచ్చేసిన చెత్త



నెల్లూరు(బారకాసు) : నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సమస్య తీవ్రతరమవుతోంది. దీని పరిష్కారానికి అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్‌ఎంసీ పరిధిలో ఉన్న మొత్తం 54 డివిజన్లల నుంచి ప్రతిరోజూ సుమారు 300 టన్నుల వరకు చెత్తను సుమారు వంద చెత్త వాహనాల ద్వారా అల్లీపురం డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

చెత్త డంపింగ్‌కు కండిషన్‌లు

కార్పొరేషన్ పరిధిలోని చెత్తను అల్లీపురం రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. ఇక్కడి నుంచి దొంతాలిలోని డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. ఈ ప్రక్రియ నిత్యం జరుగుతూనే ఉంటుంది. డంపింగ్ చేసేందుకు చెత్త ఆటో కార్మికులకు అధికారులు వివిధ నిబంధనలు పెట్టారు. దీనివల్ల గంటల తరబడి డంపింగ్‌కు వచ్చిన ఆటోలు రోడ్డుపైనే నిలబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రతి ఆటోకు సుమారు రెండు గంటల వరకు సమయం పడుతుండడంతో కార్మికులు పూర్తిస్థాయిలో చెత్త సేకరణ చేపట్టలేకపోతున్నారు.

తొలగింపులో నిర్లక్ష్యం

ప్రతిరోజు డంపింగ్ యార్డులో వేసిన చెత్తను ఇక్కడి నుంచి దొంతాలిలోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. కానీ ఇది పూర్తిస్థాయిలో జరగకపోవడంతో టన్నుల కొద్దీ చెత్త అల్లీపురం యార్డులో పేరుకుపోయి.. పరిసర ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. ప్రతిరోజు సేకరించే చెత్తను సైతం ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు కార్మికులు వాపోతున్నారు. చెత్తను డంపింగ్ యార్డులోకి తీసుకెళ్లేందుకు కార్మికులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఉంది. ఒక వేళ లోపలికి వెళ్లినా ఆటో తిరిగి బయటకు రావడానికి దారిలేకుండా ఉందని వారు వాపోతున్నారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

ప్రతిరోజు డంపింగ్ యార్డు వద్ద ఆటోలు గంటల తరబడి వేచి ఉండడంతో రోడ్డు మొత్తం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. నగరం నుంచి నవాబుపేట, అల్లీపురం ప్రధాన రహదారి మీదుగానే తోటపల్లి గూడూరు మండలంలోని గ్రామాలకు రాకపోకలు సాగించాలి. ఇలాంటి సందర్భంలో స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, ఇంజినీరింగ్ కళాశాల బస్సులు, ఇతర వాహనాలు ఇదే రోడ్డులో వస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

రోడ్డుపైనే డంపింగ్

అల్లీపురంలోని డంపింగ్ యార్డులో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. దీంతో ఆటో కార్మికులు చెత్తను యార్డు ముందున్న ప్రధాన రహదారిపైనే వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో గాలుల వల్ల ఆ చెత్త తమ ఇళ్ల వద్దకు వస్తోందని వాపోతున్నారు. ఫలితంగా అంటురోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు డంపింగ్ యార్డును నగరానికి దూరంగా ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చేస్తాం

యార్డులోకి చెత్త ఆటోలు వచ్చి డంపింగ్ చేసి తిరిగి వెళ్లేందుకు కొన్ని ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. డంపింగ్ యార్డులో చెత్త ఆటోలు రాకపోకలు సాగించేందుకు వీలుగా గ్రావెల్, డస్టర్ వేసి ఇబ్బందుల్లేకుండా చేస్తాం. ప్రస్తుతం అల్లీపురంలో ఉన్న డంపింగ్ యార్డును ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నం కూడా చేస్తున్నాం.

– రామ్మోహన్‌రావు, ఎస్‌ఈ, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్

ముక్కు మూసుకోవాల్సిందే



అల్లీపురం రోడ్డులో ప్రయాణమంటేనే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆ ప్రాంతంలో వచ్చే వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా చెత్తను రోడ్డుపైనే డంపింగ్ చేయడం వల్ల ఇబ్బందిగా ఉంది.

– రమణారెడ్డి, సత్యనారాయణపురం

క్లుప్తంగా

అన్నదానం



నెల్లూరు(బృందావనం) : పడారుపల్లిలోని దివ్యాంగుల కాలనీలో ఆచార్య పీసీరెడ్డి సమాజ మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి తన సోదరుడు వాకాటి శ్రీనివాసులురెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించుకుని తూపిలి కల్పన, శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారన్నారు. మమతారెడ్డి, సుధాకర్, తంబయ్యనాయుడు, గుమ్మడి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో మెడికల్ క్యాంపు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మెడికల్ క్యాంపును నిర్వహించారు. డాక్టర్లు కృష్ణమూర్తి, సత్యనారాయణ, సత్యనాథ్, షఫీలు మొత్తం 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాసం శేషగిరిరావు దాతగా వ్యవహరించిన కార్యక్రమంలో అధ్యక్షుడు దాసరి అనంతరామారావు, సెక్రటరీ గుర్రం వెంకటసురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కనకట్ల రఘురాం ముదిరాజు, గాలి రఘురామనాయుడు, సేగు రమేష్, స్నేహ సురేష్, పాటోలు సత్యం, పత్తి సుధాకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

పోతన భాగవతం.. కవితా శిల్పం



గంగిశెట్టి లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : మహాకవి పోతన రచించిన భాగవతం రమణీయ, కమనీయ, కవితా శిల్పమని తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయ అధ్యాపకుడు డాక్టర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'పోతన భాగవతం.. కవితా వైభవం' అనే అంశంపై ఆయన గురువారం రాత్రి ఉపన్యసించారు. భాగవత రచన భక్తితో, జనరంజకంగా సాగిందన్నారు. పోతన కవిత్వం అర్థం, శబ్దాడంబరం కలిగిందని వివరించారు. ఈ సందర్భంగా వక్త లక్ష్మీనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, నెల్లూరు రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి, గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఆర్.నారాయణస్వామి, వై.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకుడు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి



హెచ్‌డీఎస్ ప్రమాణ స్వీకారోత్సవంలో అతిథులు

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా హాస్పిటల్ డెవలప్ కమిటీ(హెచ్‌డీఎస్) సభ్యులు కృషి చేయాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం పెద్దాస్పత్రికి నూతనంగా హెచ్‌డీఎస్ కమిటీని నియమించింది. కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులుతో పాటు కమిటీ సభ్యులు బోడే వీరబ్రహ్మానందరెడ్డి, సయ్యద్ అబిదా సుల్తానా, దారా మల్లికార్జున, మొగరాల సురేష్‌లు గురువారం ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్లో గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై, మాట్లాడారు. ఎమ్మారై, సీటీ, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎకో, ఎక్స్‌రే, అన్నిరకాల రక్త పరీక్షలు పెద్దాస్పత్రిలో చేస్తారన్నారు. కమిటీ సభ్యులు నిత్యం పర్యవేక్షిస్తూ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన కమిటీ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడి సమస్యలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నేతలు కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంశీధర్, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జనసేన నేత సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

15న పొట్టిశ్రీరాములు వర్ధంతి సభ

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 15న అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఉదయం 9 గంటలకు పుష్పాలంకరణ జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నివాళులర్పిస్తామని తెలియజేశారు.

ఐటీఐలో కొత్త కోర్సులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్) : స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో కొత్త కోర్సులను ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు, పీఎం విశ్వకర్మ కోర్సులో ధోభి, బార్బర్, కార్పెంటర్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ లీడ్ సెక్టార్ కింద గుర్తించిన ఎడిబుల్ ఆయల్ ఇండస్ట్రీస్, కృష్ణపట్నం పోర్టుల్లో విద్యార్థులకు ఉపాధి కల్పించే దిశగా కొత్త కోర్సుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించనున్నట్లు తెలిపారు. ఐటీఐలో కొత్త నిర్మాణాలు, కట్టడాల ఆధునికీకరణకు రూ.1.80 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నూతన గదులు, వర్క్‌షాపు, ల్యాబ్‌ల ఆధునికీకరణ, మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

గాయపడిన కార్మికుడికి పరామర్శ



ఎస్‌ఎంసీ కార్మికుడు పెంచలయ్యను పరామర్శిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని వాహబ్‌పేట ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ గాయపడి నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైనేజీ కార్మికుడు జి.పెంచలయ్యను మేయర్ స్రవంతి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాహబ్‌పేట ప్రాంతంలో బుధవారం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు పెంచలయ్య చేతి వేళ్లు బాగా గాయపడ్డాయన్నారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి అతనికి మెరుగైన వైద్యసహాయానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. వైద్య సహాయం నగరపాలక సంస్థ ద్వారా అందిస్తానని ఆమె తెలిపారు. మేయర్ వెంట ఎస్‌ఎంసీ అధికారులు ఉన్నారు.

నష్టాలు, అంతరాయాల నివారణకే సోలార్



మాట్లాడుతున్న శేషాద్రి బాలచంద్ర, ముత్తుకుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, నష్టాల నివారణకు సోలార్ విద్యుత్ వినియోగం ఒక్కటే మార్గమని ఎస్పీడీసీఎల్ జిల్లా డీఈటీ శేషాద్రిబాలచంద్ర, నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ కె.ముత్తుకుమార్ అన్నారు. స్థానిక విద్యుత్ భవన్‌లో ఎస్పీడీసీఎల్, నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా ఉద్యోగులకు పీఎం సోలార్ విద్యుత్‌పై అవగాహన, శిక్షణా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పీఎం సోలార్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఇంటిపై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుని స్వయంగా విద్యుత్‌ను తయారు చేసుకునే సౌలభ్యం కలుగుతుందన్నారు. దీనిపై సబ్సిడీ కూడా ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఉద్యోగులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన పవర్ ఆస్ట్రో టెక్నాలజీస్ ఫౌండర్ శ్రీకాంత్, విద్యుత్‌శాఖ ఏఈ లక్ష్మీప్రసూన, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలకు వినతి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేత మిడతల రమేష్

నెల్లూరురూరల్ : దేవతల విగ్రహాలను ధ్వంసం చేయించిన ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో ఉదయభాస్కర్‌కు బీజేపీ నేత మిడతల రమేష్ గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైకస్‌రోడ్డు సెంటర్‌లో 40 ఏళ్లుగా పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడి విగ్రహం, మహాలక్ష్మిదేవి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కాంట్రాక్టర్‌పై, అందుకు బాధ్యులైన రోడ్డు భవనాల శాఖ ఈఈ, ఎస్‌ఈలపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని, అధికార యంత్రాంగానికి లేదని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడిమాని ఆదినారాయణ, సృజన, సెట్టయ్య, మారం కృష్ణ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో సీసీరోడ్లు, డ్రెయిన్స్, కల్వర్టు, రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దత్త జయంతి రేపు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో శనివారం దత్త జయంతి వేడుకలు, చతుర్వేద పండితులకు సత్కారం జరుగనుందని మందిర మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రుగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పండితులను సత్కరించనున్నట్లు వివరించారు.

ప్రధానిని కలిసిన వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(సెంట్రల్) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్కరించారు.

సమస్యలపై వినతి




జాన్ వెస్లీని కలిసిన నేతలు

నెల్లూరు(బృందావనం) : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీని తాడేపల్లిలో వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ సంఘ నాయకులు గురువారం కలిసి వివిధ సమస్యలను విన్నవించినట్లు ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ (ఏపీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ రాజశేఖర్‌దాసరి తెలిపారు. రాష్ట్రంలో పాస్టర్స్ గౌరవ వేతనం, క్రిస్టియన్‌లకు అవార్డులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులు తదితర విషయాలను వివరించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు. నేతలు రెవ.జీవన్ కుమార్, రెవ. ఇమ్మానియేల్ రెబ్బా, రెవ.సుధాకర్‌పాల్, రెవ.సాల్మన్, రెవ.జేమ్స్ పాల్గొన్నారు.

నాటు తుపాకీ పేల్చిన కేసులో వ్యక్తి అరెస్టు

రాపూరు: రాపూరు మండలం పెనుబర్తి గ్రామ సమీపంలోని అడవిలో నాటు తుపాకీ పేల్చిన ఘటనకు సంబంధించి ఓ వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదీ రాత్రి పెనుబర్తి గ్రామానికి చెందిన తాళ్ల సుధాకర్(26), శౌంటిమణి, యాకశిరి శివకుమార్ గిరిజనులు గ్రామసమీపంలో ఉన్న అటవీలో జంతువుల వేటకు వెళ్లారన్నారు. వన్యప్రాణులు వేటాడే క్రమంలో సుధాకర్‌కు కణితిపై తుపాకీ గుండు తగలడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో శౌంటిమణిని అరెస్టు చేసి, అతని వద్ద ఉన్న నాటు తుపాకీని, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయన వెంట సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ వెంకటరాజేష్ ఉన్నారు.

తీరానికి కర్రల బోటు



ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు తీరానికి కర్రలతో తయారు చేసిన బోటు గురువారం కొట్టుకొచ్చింది. ఈ బోటు పొరుగు జిల్లాల్లో చేపల వేటకు ఉపయోగిస్తారని, సముద్రం కసురుగా ఉండడంతో కొట్టుకు వచ్చిందని స్థానిక మత్స్యకారులు చెప్పారు. కాగా అల్పపీడన ప్రభావంతో మైపాడు తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి.

కుష్టు, టీబీపై అవగాహన ఉండాలి



అర్బన్ హెల్త్ సెంటర్‌లో రోగి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : సమాజంలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న టీబీ(క్షయ), కుష్టు వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. నగరంలోని పీసీనాయుడు వీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కొడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. రాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ హెల్త్ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులకు పలు జాగ్రత్తలు వివరించారు. రెండు వారాలకు మించి పొడి దగ్గు, జ్వరం రావడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటే వారు వెంటనే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ప్రభుత్వం మందులు, పౌష్టికాహారానికి నగదు అందజేస్తుందన్నారు. ఆరు నెలలు మందులు క్రమం తప్పకుండా వాడితే జబ్బు నయం అవుతుందన్నారు. అలాగే శరీరంపై పెద్ద నలుపు, తేనె, గోదుమ రంగు మచ్చలుండి స్పర్శలేకపోతే కుష్టు వ్యాధి పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాలచంద్ర, డీపీఎంఓ నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న పీడీ శివన్నారాయణ

నెల్లూరు(సెంట్రల్) : వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ అన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు వీపీఏలు, వీహెచ్‌ఏలు, వీఎస్‌ఏలకు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.


ఆలయ కూల్చివేతపై కేసు నమోదు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(బృందావనం) : డైకస్‌రోడ్డు సెంటర్‌లో ఉన్న నాగమ్మ ఆలయం కూల్చివేతపై ఎట్టకేలకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారుల, కాంట్రాక్టర్ అత్యుత్సాహంతో బుధవారం ఆలయాన్ని కూల్చివేశారు. అయితే పట్టాభూమిలో ఉన్న ఆలయం కూల్చివేతపై హిందూ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు పగడాల గంగా మహేష్‌తో పాటు మరికొందరు అధికారులు, కాంట్రాక్టర్ తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తూ బుధవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే స్థానిక హిందూ సంఘాల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

డీకేడబ్ల్యూలో భాషా ఉత్సవం



రెడ్డిశ్యామలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో భారతీయ భాషా ఉత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. డీకేడబ్ల్యూతో పాటు విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీపొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయ ఆచార్యులు వై.రెడ్డిశ్యామల హాజరై, భాషా అభివృద్ధికి నిఘంటు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు కరుణశ్రీ, పద్మప్రియ, దివ్య, సత్యనారాయణ, సురేంద్ర, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.